క్లుప్తంగా

నేడు ధ్వజస్తంభ ప్రతిష్ఠ

మద్దికెర: స్థానిక శివజ్యోతి వృద్ధాశ్రమంలో నిర్మించిన శ్రీశైల భ్రమరాంబిక మల్లికార్జున స్వామివారి దేవాలయంలో మంగళవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ, కలశ ప్రతిష్ఠ కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు మల్లికార్జున సోమవారం తెలిపారు. ఉదయం గణపతి పూజ, రుద్రాభిషేకం, రక్షాబంధం, భూమి పూజ తదితర కార్యక్రమాలు ఉంటాయని, 15వతేదీ యాగశాల ప్రవేశం, ద్వారాతోరణం, ధ్వజకుంభ ఆరాధన, ధ్వజస్థంభ స్థపనం, జలాధివాసం, క్షీరాధివాసం, మహానైవేద్యం, మంగళనీరాజనం ఉంటాయని, 16వ తేదీ ధ్వజస్తంభ ప్రాణ ప్రతిష్ఠ, మహా పూర్ణాహుతి, కలశ ప్రతిష్ఠ, కుంభాభిషేకం తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. అలాగే భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

18 నుంచి ఉరుసు

చిప్పగిరి: ఈ నెల 18 నుంచి నంచర్లలో హజరత్ దివానే మస్తాన్ వలి స్వామి 37వ ఉరుసు మహోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు శేషావలి సోమవారం తెలిపారు. వారు మాట్లాడుతూ 18న గంధం, 19న ఉరుసు నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తాదులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ఇనాం భూమి ఆక్రమణను అడ్డుకోండి

తుగ్గలి: శభాష్‌పురం గ్రామ సమీపంలో ఉన్న రంగస్వామి ఇనాం భూమి ఆక్రమణకు గురవుతోందని సచివాయల మండల కన్వీనర్ హనుమంతు, గ్రామస్తులు సోమవారం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. సర్వే నంబరు 88లో ఉన్న స్వామి ఇనాం భూమిని ఓ రైతు ఆక్రమించుకుని తన పొలంలోకి కలుపుకున్నాడన్నారు. ఈ విషయమై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసి నెల రోజులు గడిచినా పట్టించుకోలేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఆక్రమణకు గురైన ఇనాం భూమి తిరిగి స్వామికి చెందేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. అధికారులు స్పందించకపోతే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ మేరకు వారు మండల సర్వేయర్ గాదిలింగప్పకు వినతి పత్రం అందజేశారు.

కరివేములలో రక్తదాన శిబిరం


రక్తదాన శిబిరంలో యువకులు

ఆలూరు: దేవనకొండ మండలం కరివేముల గ్రామంలో సోమవారం డేనియల్‌రాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 65 మంది యువకులు స్వచ్ఛందంగా ముందుకువచ్చి రక్తదానం చేశారు. అనంతరం డేనియల్ రాజ్ ఫౌండేషన్ నిర్వాహకులు సుమన్, వీరేష్, కృష్ణ తదితరులు మాట్లాడారు. రక్తహీనతతో బాధ పడుతున్న వారికి రక్తదానం చేస్తే మరొకరికి ప్రాణం పోసిన పుణ్యం లభిస్తుందన్నారు. రక్తదాన శిబిరం ఏర్పాటు చేసిన నిర్వాహకులను గ్రామస్తులు అభినందించారు.

గుజిరి షాప్‌లో షార్ట్ సర్క్యూట్

వెల్దుర్తి: స్థానిక గౌతమి హోటల్ వీధిలోగల మద్దిలేటికి చెందిన గుజిరి సామాను దుకాణంలో సోమవారం మధ్యాహ్నం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం సంభవించింది. షాప్‌లోని కాగితం, ప్లాస్టిక్ సామాన్లకు నిప్పంటుకుని వేగంగా వ్యాపించాయి. చుట్టుపక్కలవారి సాయంతో మంటలు ఆర్పగా అప్పటికే దాదాపు రూ.50 వేల విలువ గల సామగ్రి కాలిపోయినట్లు బాధితుడు వాపోయాడు.

18న క్రికెట్ టోర్నీ

పత్తికొండరూరల్: మండల పరిధిలోని పులికొండ రంగనాథస్వామి తిరునాల సందర్భంగా ఈ నెల 18న జిల్లాస్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్స్ సురేష్, రఘు సోమవారం తెలిపారు. విజేతలకు రూ.20 వేలు,రూ.10వేలు,రూ.5 వేలు చొప్పున నగదు బహుమతులు అందించనున్న ట్లు వెల్లడించారు. ఆసక్తిగల వారు సెల్ 97053 32256,9515385091నంబర్లను సంప్రదించి జట్టు పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.

16న మండల సర్వసభ్య సమావేశం

కృష్ణగిరి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 16న మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మోహన్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. సమావేశంలో మండలంలో చేపట్టే కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. అన్ని శాఖల అధికారులు తమ నివేదికలతో రావాలని, అలాగే ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు తప్పక హాజరుకావాలని కోరారు.

శనగకు మద్దతు ధర

మద్దికెర: రబీ సీజన్‌లో సాగు చేసిన శనగ దిగుబడులకు ప్రభుత్వం రూ.5,335 కనీస మద్దతు ధర కల్పించిందని, ఈ-కేవైసీ చేయించుకున్న రైతుల వద్ద నుంచి మార్క్‌ఫెడ్ అధికారులు దిగుబడులను కొనుగోలు చేస్తారని ఏఓ హేమలత సోమవారం తెలిపారు. ఏఓ మాట్లాడుతూ.. ఈనెల 23వ తేదీలోపు సంబంధిత రైతు భరోసా కేంద్రాలలో రైతులు ఈ-కేవైసీ చేయించుకోవాలని సూచించారు.

శాసనమండలి ఎన్నికల సందడి


ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఫ్లెక్సీలను తొలగించి ట్రాక్టర్‌లో తరలిస్తున్న పంచాయతీ సిబ్బంది

- ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల
- ఓటర్ల జాబితా సిద్ధం
- అమల్లోకి ఎన్నికల కోడ్

పత్తికొండ రూరల్: స్థానిక సంస్థల కోటాలో శాసన మండలి ఎన్నికకు సంబంధించి సందడి మొదలైంది. ఈ నెల 16న నోటిఫికేషన్ విడుదలతో ప్రారంభం కానున్న ఈ ప్రక్రియ మార్చి 16న కౌంటింగ్‌తో ముగుస్తుంది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం ఇటీవలే షెడ్యూలు ప్రకటించింది. దీని ప్రకారంగానే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చింది. ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుంది. దీని ప్రకారం ప్రభుత్వ పథకాల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయరాదు. ప్రస్తుతం కొనసాగుతున్న పథకాలను యథాతథంగా అమలు చేయవచ్చు. ప్రచార హోర్డింగులు ఉండరాదు.

షెడ్యూల్ ఇలా..

నామినేషన్ల స్వీకరణ : ఈ నెల 16 నుంచి 23వ తేదీ వరకు
నామినేషన్ల పరిశీలన : 24వ తేదీ
పోలింగ్ : మార్చి 13
కౌంటింగ్, ఫలితాల వెల్లడి : మార్చి 16

వార్ వన్‌సైడ్

గతంలో జరిగిన జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తిరుగులేని ఆధిక్యాన్ని చాటింది. సుమారు 90 శాతం జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో విజయఢంకా మోగించి తిరుగులేని శక్తిగా ఏర్పడింది. జెడ్పీటీసీ, ఎంపీటీసీ, వార్డు సభ్యులు, ఎమ్మెల్యే ఓటుతో కలిపి రెవెన్యూ డివిజన్ పరిధిలో 144 ఓటర్లు ఉన్నారు. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నిక వైఎస్సార్‌సీపీకి లాంఛనమే కానుంది.

పత్తికొండ డివిజన్‌లో గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఓటర్ల వివరాలు

మండలం	పురుష ఓటర్లు	స్త్రీ ఓటర్లు	మొత్తం	పురుష ఉపాధ్యాయులు	మహిళా ఉపాధ్యాయులు	మొత్తం
ఆలూరు	823	254	1,077	37	8	45
ఆస్పరి	910	241	1,124	16	2	18
చిప్పగిరి	404	93	497	10	3	13
దేవనకొండ	1,056	213	1,269	37	8	45
హాలహర్వి	250	47	297	2	0	2
మద్దికెర ఈస్ట్	589	179	768	36	13	49
పత్తికొండ -2	1,608	604	2,212	138	86	224
తుగ్గలి	1,081	263	1,344	16	9	25
క్రిష్ణగిరి	693	142	835	7	2	9
మొత్తం	7,414	2,009	9,423	299	131	430

ఎన్నికల కోడ్ పాటించాలి



అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం నడుచుకోవాలి. నిబంధనలు ధిక్కరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ప్రధాన రోడ్డు పొడవునా గతంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించేలా చర్యలు చేపట్టాం. రాజకీయ పార్టీలకు సంబంధించిన ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేయరాదు. ఓటు హక్కు పొందిన వారందరూ నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి.

– మోహన్‌దాస్, ఆర్డీఓ, పత్తికొండ

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

కృష్ణగిరి: ఈయేడాది పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా పనిచేయాలని ఎంఈఓ విజయభాస్కర్ ఆదేశించారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో సోమవారం ఆయన అన్ని పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వారిని గ్రేడ్‌లుగా విభజించి విద్యను అందించాలని సూచించారు. సీ, డీ గ్రేడ్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి వారిని ప్రోత్సహించాలన్నారు. అలాగే ప్రతి రోజూ అన్ని పాఠశాలల్లో విద్యార్థుల హాజరును ఆన్‌లైన్‌లో తప్పక నమోదు చేయాలని సూచించారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎంఎంఎస్ కో-ఆర్డినేటర్ రాజేష్, సీఆర్పీలు కృష్ణమూర్తి, వీరనాగప్ప, శ్యామల, మధు, అన్ని పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

త్రీమెన్ కమిటీల పదవీకాలం పొడిగింపు

తుగ్గలి: సహకార సంఘాలకు త్రీమెన్ కమిటీల పదవీ కాలాన్ని మరో ఆరు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మండలంలో రెండు సహకార సంఘాలు ఉన్నాయి. ఇప్పటివరకు కొనసాగుతున్న ఉప్పర్లపల్లి సహకార సంఘం చైర్‌పర్సన్ విజయలక్ష్మి, మారెళ్ల సహకార సంఘం చైర్మన్ గోపాల్‌రెడ్డి యథాతథంగా మరో ఆరు నెలలు కొనసాగుతారని ఆ సంఘాల సీఈఓలు గిడ్డయ్య, మనోహర్‌నాయుడు సోమవారం తెలిపారు.

రిజిస్ట్రేషన్లు పారదర్శకంగా చేపట్టండి


రిజిస్ట్రేషన్ ప్రక్రియపై సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న సబ్‌రిజిస్ట్రార్ రాందాసు

ఎమ్మిగనూరు: ప్రజల చెంతకే సుపరిపాలన అందించాలనే ధ్యేయంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లను కూడా ప్రారంభించారని, రిజిస్ట్రేషన్లను పారదర్శకంగా చేపట్టాలని సబ్ రిజిస్ట్రార్ రాందాసు సూచించారు. ఆయన సోమవారం రిజిస్ట్రేషన్ల కోసం ఎంపిక చేసిన సచివాలయ కార్యదర్శులు, ప్లానింగ్ సెక్రటరీలకు ఎమ్మిగనూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ స్థిరాస్తి రిజిస్ట్రేషన్లలో చాలా జాగ్రత్తతో ఉండాలని, జవాబుదారీగా బాధ్యతలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా డాక్యుమెంట్ల పరిశీలనలో ఈసీ, ఆర్వోఆర్, అడంగల్, లింక్ డాక్యుమెంట్లను నిశితంగా పరిశీలించాలన్నారు. మార్కెట్ విలువ ఆధారిత చలాన్లు, ఫీజులు కట్టించాలని సూచించారు. అక్నాలెడ్జ్‌మెంట్ అప్‌డేట్, డేటా ఫీడింగ్, చెక్‌స్లిప్, రెగ్యులర్ నంబర్ల కేటాయింపు, ఫొటో ఐరిష్, వేలిముద్రలు తీసుకోవడం, డాక్యుమెంట్ ప్రింటింగ్, స్కానింగ్‌లు చేయాల్సి ఉంటుందని సూచించారు. రిజిస్ట్రేషన్లలో దస్తావేజు, దాన సెటిల్‌మెంట్, తనఖా, చెల్లు, రసీదు, భాగపరిష్కార రిజిస్ట్రేషన్లు ఉంటాయని వివరించారు. అలాగే వివాహ రిజిస్ట్రేషన్లు, మ్యారేజీ సర్టిఫికెట్ల జారీ ఉంటాయన్నారు. సచివాలయాల్లో జరిగే స్థిర, చరాస్తుల రిజిస్ట్రేషన్లపై ఎప్పటికప్పుడు పైఅధికారుల పర్యవేక్షణ ఉంటుందన్నారు.ఆయా గ్రామాల సచివాలయ కార్యదర్శులు, ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

బురదచల్లుడు రాజకీయాలు మానుకోవాలి


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పత్తికొండటౌన్: ప్రతి తప్పుడు పనిని అధికారపార్టీకి అంటగడుతూ బురద చల్లుడు రాజకీయాలు చేయడం మానుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి సి.శ్రీరంగడు, మండల కన్వీనర్ కారం నాగరాజు, వైస్ ఎంపీపీ కురువ బలరాముడు హితవు పలికారు.సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. పత్తికొండ పోలీసులు స్వాధీనం చేసుకున్న కర్ణాటక మద్యం కేసులో వాస్తవాలు తెలుసుకోకుండా టీడీపీ నాయకులు ఆరోపణలు చేయడం, ఎల్లో మీడియాలో తప్పుడు కథనాలు ప్రసారం చేయడం సిగ్గుచేటన్నారు. మద్యం కేసు నిందితులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారని, కేసులో వైఎస్సార్‌సీపీ నాయకుల పాత్ర ఉంటే పేర్లు బహిర్గతం చేయాలని సవాల్ విసిరారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి లలితా రామచంద్ర, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌నాయక్, ఎస్సీ సెల్ జిల్లా నాయకులు రైట్స్ వెంకటేశ్వర్లు, సర్పంచులు కేశవరెడ్డి, శ్రీరాములు, రహిమాన్, అంజినయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలతోనూ సంపద సృష్టి


మాట్లాడుతున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు

ఎమ్మిగనూరు: పారిశుద్ధ్యంపై ప్రజల భాగస్వామ్యం పెరగాలని, వ్యర్థాలతో ఉత్తమ ఉత్పత్తులు తయారు చేయవచ్చని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం స్థానిక సిద్దార్థ కళాశాలలో విద్యార్థులకు పారిశుద్ధ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి, పొడి చెత్తను వేరుచేసి సేకరణ చేపట్టడం వల్ల మంచి ఫలితాలు ఉంటాయన్నారు. ప్రతిరోజు గృహాలు, కమర్షియల్ వినియోగదారుల నుంచి సేకరించే తడి చెత్తను కంపోస్టు ఎరువులు, బయోగ్యాస్ ఉత్పత్తికి వినియోగించవచ్చన్నారు. పొడి చెత్త నుంచి సంపద సృష్టించ వచ్చన్నారు. అలాగే గాజుసీసాలు, ప్లాస్టిక్ డబ్బాలు, అట్టముక్కలు, కవర్లు, పేపర్లను గడి వేములలోని సిమెంట్ ఫ్యాక్టరీకి తరలించి పునర్వినియోగం... పునరుత్పత్తి చేపడతారని వివరించారు. విద్యార్థులు పారిశుద్ధ్యంపై అవగాహన పెంచుకొని ఇరుగుపొరుగు వారికి వివరించాలన్నారు. కళాశాల కరెస్పాండెంట్ వేణుగోపాలాచారి, సచివాలయ ప్లానింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక


నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న దృశ్యం

కృష్ణగిరి: కృష్ణగిరి మండల యూటీఎఫ్ అధ్యక్షుడిగా టి.లక్ష్మినారాయణ రెడ్డి, గౌరవాధ్యక్షుడిగా రామకృష్ణను సోమవారం స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారులు హేమంత్‌కుమార్, లక్ష్మిదేవి తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా దుర్గప్రసాద్, సహ అధ్యక్షులుగా వామనమూర్తి, హరిత, ఆర్థిక కార్యదర్శిగా సురేష్, మహిళా విభాగం కన్వీనర్‌గా కృష్ణవేణి, సీపీఎస్ కన్వీనర్ నాగరాజుతోపాటు జిల్లా కౌన్సిల్ సభ్యులుగా ఎన్వీ శేషారెడ్డి, రవికుమార్‌లను ఎన్నుకున్నట్లు వారు వెల్లడించారు. అనంతరం నూతన కమిటీతో ప్రమాణ స్వీకారం చేయించారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ.. మండలంలోని ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

శ్రీశైలానికి తరలిన శివస్వాములు


ఇరుముడులతో శ్రీశైలానికి బయలుదేరిన పెనుమాడ శివస్వాములు

కృష్ణగిరి: మండల పరిధిలోని పెనుమాడ గ్రామానికి చెందిన శివస్వాములు సోమవారం కాలినడకన శ్రీశైలానికి బయలుదేరి వెళ్లారు. గ్రామంలోని అన్ని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం శివాలయంలో గురుస్వామి ఆధ్వర్యంలో ఇరుముడి ధరించారు. శివస్వాములను గ్రామస్తులు మేళతాళలతో ఊరేగించి వీడ్కోలు పలికారు.

మద్దికెర: మండల కేంద్రానికి చెందిన శివభక్తులు శ్రీశైల మల్లికార్జున స్వామి, భ్రమరాంబా దేవిని దర్శించుకునేందుకు సోమవారం కాలినడకన బయలుదేరి వెళ్లారు. అంతకుముందు పూజారి ఈశ్వరప్ప, కొత్తకురువ రామాంజులు ఆధ్వర్యంలో స్థానిక శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఏటా మహాశివరాత్రికి కాలినడకన శ్రీశైలానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుంటామని తెలిపారు. అలాగే మండల పరిధిలోని పెరవలి గ్రామంలో శివ మాలదారులు 41 రోజులు దీక్ష చేపట్టి ఇరుముడులతో శ్రీశైలానికి బయలుదేరి వెళ్లారు.

హొళగుంద పీహెచ్‌సీకి డాక్టర్ల నియామకం


విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ తిమ్మన్న

సాక్షి ఎఫెక్ట్

హొళగుంద: హొళగుంద ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధుల పట్ల వైద్యుల నిర్లక్ష్యం, ప్రజలకు వైద్య సేవలు అందకపోవడంపై ఆదివారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన 'వైద్యం దైవాధీనం' కథనానికి ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు స్పందించారు. గజ్జహళ్లి పీహెచ్‌సీ నుంచి ఇక్కడికి బదిలీపై రావాల్సిన న్యూటన్ అనే వైద్యుడు బాధ్యతలు తీసుకోకుండా సెలవులో ఉండడం, మరో వైద్యుడు వెంకటసుబ్బయ్య గత రెండు నెలలుగా ఆస్పత్రికి రాకపోవడంతో ప్రజలకు వైద్య సేవలు అందని ద్రాక్షగా మారిన సంగతి తెలిసిందే. పీహెచ్‌సీలో ఉండే స్టాఫ్ నర్సులే రోగులకు దిక్కుగా మారారు. ఈ నెల 11న హొళగుందకు చెందిన ఓ మహిళను చికిత్స కోసం పీహెచ్‌సీకి తీసుకురాగా వైద్యులు లేకపోవడంతో మెరుగైన చికిత్స కోసం సిబ్బంది ఆదోనికి రెఫర్ చేశారు. మార్గమధ్యలోనే ఆమె మరణించింది. దీనిపై పత్రికలో వార్త కథనాలు ప్రచురితం కావడంతో ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. సెలవులో ఉన్న వైద్యుడు న్యూటన్ వెంటనే విధుల్లో చేరేలా చర్యలు తీసుకోవడంతో పాటు మరో డాక్టరు వెంకటసుబ్బయ్య స్థానంలో హాలహర్వి పీహెచ్‌సీలో పని చేసే డాక్టర్ తిమ్మన్నను హొళగుందకు తాత్కాలిక డాక్టరుగా ఆదోని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సత్యవతి నియమించారు. ఇదిలా ఉండగా డాక్టరు వెంకటసుబ్బయ్యను ఉన్నతాధికారులు డీఎంహెచ్‌ఓకు సరెండర్ చేసినట్లు సమాచారం. ఏదేమైనా ఇన్నాళ్లు డాక్టర్లు లేక బోసిపోయిన ఆస్పత్రిలో సోమవారం ఇద్దరు డాక్టర్లు అందుబాటులో ఉండి రోగులకు సేవలందించడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

చెన్నకేశవ స్వామికి ప్రత్యేక పూజలు

ఆలూరు: దేవనకొండ మండలం కప్పట్రాళ్ల గ్రామ ఫారెస్ట్ కొండల్లో కొలువు దీరిన శ్రీదేవి, భూదేవి సమేత కొలుట్ల చెన్నకేశవస్వామి ఆలయంలో సోమవారం ఆలయ చైర్మన్ హనుమంత రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు హరిప్రసాద్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగపూజ, కుంకుమార్చన, ఫల, పుష్ప మహా మంగళ హారతి పూజలు చేపట్టారు. పూజా కార్యక్రమాల్లో ఎమ్మిగనూరు ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు వై.సీతారామిరెడ్డి, ఆర్.వెంకటేశ్వర రెడ్డి, దస్తగిరిగౌడు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు

నందవరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జల జీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతి ఇంటికీ కుళాయి ఏర్పాటు చేస్తే స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామని గ్రామ సర్పంచ్ మద్దీశ్వరి తెలిపారు. సోమవారం కనకవీడు గ్రామ సచివాలయంలో ఐఎస్ఏ జిల్లా మానిటరింగ్ ప్రాజెక్టు సమన్వయకర్త భీమశంకర రెడ్డి నేతృత్వంలో జల జీవన్ మిషన్‌పై గ్రామసభ నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. వచ్చే ఏడాది నాటికి ఈ పథకం ద్వారా ప్రతి గ్రామంలో ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. అలాగే గ్రామంలో పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. మాజీ సర్పంచ్ లక్ష్మీకాంతరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటరాముడు, ఉప సర్పంచ్ లక్ష్మీకాంతరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రామారావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం లోపిస్తే చర్యలు

హొళగుంద: గ్రామంలో పారిశుద్ధ్యం లోపిస్తే సహించేది లేదని, శానిటరీ సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హొళగుంద మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ హెచ్చరించారు. సోమవారం ఆయన వార్డు సభ్యులు సుభాన్, అబ్దుల్ రహిమాన్‌తో కలిసి స్థానిక ఈబీసీ కాలనీలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. కాలనీలోని అన్ని వీధుల్లో చెత్త తొలగింపు, డ్రైనేజీలను శుభ్రం చేయడం, మురుగునీరు తొలగింపు పనులు చేయించారు. వీధులలో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. స్థానిక ఫిల్టర్‌బెడ్ వద్ద సంప్‌లోని నీటిని క్లోరినేషన్ చేయించారు. గ్రామస్తులు చెత్త చెదారాన్ని వీధుల్లో పారవేయకుండా శుభ్రత పాటించాలని కోరారు. ప్రజలు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకుని తమవంతు సహకారం అందించాలని కోరారు.

అథ్లెటిక్స్‌లో ప్రతిభ


సహచర క్రీడాకారులతో అరవింద్

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని కోతిరాళ్ల గ్రామానికి చెందిన ఆవుల అరవింద్ బీహార్‌లో జాతీయ అంతర్ జిల్లా జూనియర్ అథ్లెటిక్స్ మీట్ అథ్లెట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన 600 మీటర్లు, 100 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానంలో నిలిచాడు. వెంకటేష్, ఆదిలక్ష్మి దంపతుల కుమారుడైన అరవింద్ గ్రామంలో మూడో తరగతి వరకు చదివాడు. క్రీడలపై ఆసక్తితో కడప స్పోర్ట్స్ పాఠశాలలో సీటు సంపాదించి అక్కడ 9వ తరగతి చదువుతున్నాడు. ఒలంపిక్స్‌లో భారత్‌కు స్వర్ణ పతకాన్ని సాధించడం తన లక్ష్యమని అరవింద్ సోమవారం తెలిపాడు. విద్యార్థి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

అర్హులందరికీ పథకాలు అందాలి


పంచాయతీ కార్యదర్శులతో సమావేశమైన ఎంపీడీఓ అల్లబకాష్

ఆలూరు: గ్రామాల్లో అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలని ఎంపీడీఓ అల్లబకాష్ గ్రామ పంచాయతీ కార్యదర్శులను (పీఎస్) ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన సోమవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పీఎస్‌లతో సమావేశమయ్యారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రతి ఇంటికి సంబంధించిన సెస్సు, పన్ను బకాయిలను మార్చి నెలాఖరులోగా వసూలు చేయాలని సూచించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు తాగునీరు సరఫరా చేసే ట్యాంకులను ఎప్పటికప్పుడు సిబ్బంది చేత శుభ్రం చేయించాలన్నారు. పీఎస్‌లు విజయ్‌కుమార్, వెంకటనాయుడు, రమేష్, జిలాని తదితరులు పాల్గొన్నారు.

బీమా తక్షణసాయం అందజేత

హొళగుంద: మండల పరిధిలోని ఇంగళదహాళ్ గ్రామానికి చెందిన దుతరాజు అనే వ్యక్తి సోమవారం అనారోగ్యంతో మరణించాడు. అతని భార్య మమత, కుటుంబ సభ్యులను సర్పంచ్ ప్రభావతమ్మ, ఎంపీటీసీ మల్లికార్జున, వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకట్రామిరెడ్డి పరామర్శించారు. ఆ కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణసాయం కింద మంజూరైన రూ.10 వేలను అందజేశారు. మిగతా సొమ్ము త్వరలోనే నామినీ బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని తెలిపారు.

సరోజిని నాయుడుకు నివాళి

వెల్దుర్తి: స్వతంత్ర్య సమరయోధురాలు, దేశంలోని మొదటి మహిళా గవర్నర్ సరోజిని నాయుడు జయంతి పురస్కరించుకుని సోమవారం స్థానిక గ్రంథాలయంలో లైబ్రేరియన్ కవితాబాయ్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. సరోజిని దేవి చిత్రపటానికి పూలమాల వేసి, ఆమె దేశానికి చేసిన సేవలను వివరించారు. పాఠకులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఆలూరు: దేవనకొండ మండలం తెర్నెకల్ గ్రామంలో సర్పంచ్ అరుణకుమార్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక గ్రామ సచివాలయానికి మంజూరైన రూ.20 లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. స్థానిక నాయకులు వెంట ఉన్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలి

మద్దికెర: రాష్ట్ర ప్రభుత్వం శనగకు (క్వింటాలు) రూ.7 వేలు గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేయాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి హనుమప్ప, సీపీఐ మండల కార్యదర్శి నాగరాజు కోరారు. సోమవారం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ నాగరాజుకు అందజేశారు. వారు మాట్లాడుతూ మండలంలో వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పెద్దఎత్తున శనగ పంటను సాగు చేశారన్నారు. ఆశించిన స్థాయిలో దిగుబడి రాక రైతులు నష్టపోయారని ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని కోరారు.

అన్నదాన కార్యక్రమానికి సహకారం

పత్తికొండ రూరల్: శ్రీశైలానికి కాలినడకన వెళ్లే భక్తులకు కైలాసద్వారం వద్ద భోజన వసతి కల్పించేందుకు సేవాదళ్ ఆధ్వర్యంలో అన్నదానానికి కావాల్సిన సామగ్రి, సభ్యులతో లారీ బయల్దేరింది. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏటా భక్తులకు మూడు రోజుల పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. సోమవారం సేవాదళ్ అధ్యక్షుడు పోచిమిరెడ్డి మురళీధర్‌రెడ్డి ఆయన సతీమణి శోభారాణి, కుమార్తె భార్గవిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి వాహనాన్ని సాగనంపారు.

కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలి

ఎమ్మిగనూరురూరల్: గ్రీన్ అంబాసిడర్లకు కనీస వేతనం రూ.18 వేలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు రామాంజనేయులు, మండల కన్వీనర్ రాముడు, వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ కార్యదర్శి తిమ్మన్న పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రీన్ అంబాసిడర్లు ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. కార్మికులకు పెండింగ్ బకాయిలు చెల్లించాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పనిముట్ల మరమ్మతులకు నగదు జమ చేయాలని డిమాండ్ 24 నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే విడుదల చేయాలన్నారు. అనంతరం అధికారులకు వినతి పత్రం అందచేశారు. నాయకులు అబ్దుల్లా, రాముడు, రామన్న తదితరులు పాల్గొన్నారు.